రహమాన్ దాన్ని చూసీచూడ్డంతోనే కూడాకూడా వున్న పదిమంది పఠానుల్ని పలుకరించేడు. మన పదిమందికీ కాదు మరి పదిమంది వచ్చినా నేటివిందుకిది సరిపోయేని, ఈ ఒక్క గొఱ్ఱిపోతూను, మందంతా ఒకెత్తు, ఇదివొకెత్తు అన్నాడు. అని అలా కొమ్ముమీద చెయ్యి వేశాడు.

గొఱ్ఱిపోతు గొఱ్ఱిపోతు అంతఎత్తు మువ్వచప్పుడుతో ఎగ నెగసిపడి ముందుకు పొడిచింది, రహమాన్ వెనక్కు తూలి పడ్డాడు వెల్లకితల పడ్డాడు.

తతిమ్మా పఠానులందరూ గొఱ్ఱిపోతును ఆపబోయారు. ఆపవద్దు! అదైనా చావాలి. నేనైనా చావాలి. అని అంటూ రహమాన్ పోతుతో తిరుగ కలబడి పెద్ద పోరాటం సలిపాడు. ఎల్లరూ చూస్తూవుండగా గొఱ్ఱిపోతు రహమాన్ నాటి పోరులో ప్రాణాలు గోల్పోయారు.

చచ్చిపోయిన గొఱ్ఱిపోతుతో హయిందవులు నాడు విందు చేసుకున్నారు. చచ్చిపోయిన రహమానును నాడు పఠానులు మోసుకు పోయినారు.

.... .... .... .... ....

# పెద్దద్దం

వంకీ లెడుదో? శంఖాలేస్తో? అంకమ్మా!
చీనీకడుదో? పీనా తిందో? అంకమ్మా?
బ్రాకెట్ కొట్టావు! పచ్చని గెల్పా?
ఎఱ్ఱని గెల్పా? అంకమ్మా?
అంకెకు సున్నాలెన్నిచేర్చావ్? అంకమ్మా!
జాకెట్‌లోని ప్యాకెట్టెవరికి? అంకమ్మా!
పకోడిలాండితె "పాప్" దేవతకా?
నా కా? సెప్పు! అంకమ్మా!"

అంటూ అంశమంతుడు అంకమ్మను వెంటాడిస్తూవుంటే, అంకమ్మ ఆణ్ని ఆ అంశమంతుణ్ణి-వాడిపేరే అంశమంతుడు-నేనేదో పేరెట్టాను అని అనుకొనేరు కనక-విదలించు కొన్నట్టు విసరికొట్టి "ఉండ్రా! ముందు మార్వాడీకాడికెళ్ళి నా మొహరీ బిళ్ళ వదిలించుకు రానీ! కూడా వెంటబడ కప్పుడే. ఈ నెల్లో "పాప్" ఎడాన్నిపోసిన వెన్నో తెలుసునా? రూ. 250/- ఏ బాపతు వైతేం ఎక్కణ్ణుంచి పట్టుకొచ్చి వేస్తేం! ఏభై లోను చివర పాతిక మోరీ బిళ్ళట్టుకెళ్ళి మార్వాడీకాడ పెట్టితేగాని అంత సొమ్ము అమరలేదు. ఇంతకూ ఇన్నాళ్ళ కొచ్చినయి రెండు వందలు. ఇంకా ఏభై రాబడితేనే తప్ప అసలుక్కురదలా" అంశమంతుడు "మరదలా!" అంకమ్మ "నేనన్నది కురద లారా!" నాడు "కురదలా మాటకేంగాని నేనొకటి అడుగుతా సొప్పు-నీవన్న రెండువందలూ ఒక్కరాత్రి అంకెకే వచ్చాయి?" అంకమ్మ "వస్తే ఆలాగే వస్తాది! కాయి! నీవూ కాయి! నా వెంటబడకు—నలుగురూ నవ్వేరు—"

అంశమంతుడు అంకమ్మకేసి వెఱ్ఱిగా చూస్తూ "నేనూ వస్తాను మార్వాడీకాడికి, నాకూ వోపాతిక రూపాయ లిస్తాదేమో: "నీ కాడా బంగారం వుంటే ఎందుకివ్వడూ?"

"నీవు నిజంగా బంగారమెట్టే తెచ్చావు ఆడికాణ్ణుంచి డబ్బు?" "ఓరి! నీ తెలివిమండా! ఎంత సెప్పినా నామాట నమ్మవు!" "నీకూడా వస్తాను". "ఎందుకు? నన్ను పరీక్ష చేయడానికా?" "కాదు! ఆ మార్వాడీని చూడ్డానికి." "మార్వాడీని చూడ్డానికేముంది? ఆడూ మనిషే. నీకాడ బంగార ముండాలి ఆడికాణ్ణుంచి డబ్బుచ్చుకోడానికి. ఊరికే మార్వాడీ

ముఖం చూస్తే ఆడు నవ్వివోతాడు." "బంగారమా?" అంటూ అంశమంతు డింకా ఆలోచిస్తూ వుండగానే అంకమ్మ వోసందు మలుపు తిరిగి మాయమై పోయింది.

అంశమంతుడు హైరోడ్డంతా ఈ పక్కనుంచి ఆ పక్కదాకా తేరిపార చూచి "ఇట్టే కనుపాపల్లోంచి జారి వూరుకుంది దాని తస్సాతియ్యా" అని లోపలనుకుంటూ పైకి గట్టిగా "అంకమ్మా! అంకమ్మా" అంటూ ఇంటి తలుపుకొట్టి పిలిచి నంత బిగ్గఱగా అఱచాడు.

ఆ పిలుపు వింటూ హైరోడ్డుమీది మనిషి వొకడు "ఎవరు అంకమ్మ? అలా గట్టిగా అరుస్తావెందుకు" అన్నాడు. అనేసరికి అంశమంతుడు తెలివితెచ్చుకున్నవానికి మల్లే "లేదు! బ్రాకెట్ వేదామని ఆలా అఱిచాను" అన్నాడు. "బ్రాకేట్ వేయతలిస్తే నాతోకూడా రా! అంకో! అంకో! అని అరిస్తే బ్రాకెట్ పడుతుందా రా నాతో రా! ఎంతవేయా లనుకుంటూ వున్నావు?" అంశమంతుడు "మీరెంత కాయమంటే అంత!" "నీ దగ్గఱ ఎంత డబ్బువుందో అంతా కానెయ్యి! ఈ రేత్రి పడేలాంటి అంకెవంటిదే రాత్రీ పడదు. ఇదిగో అట్ట నాచేతిలో వుంది. అట్టమీద అంకెలు చూచుకో! బోర్డుమీద వ్రాసిన రెట్లెట్టి గుణించుకో—" అంశమంతుడు "ఇప్పుడు కాదు మఱో అప్పుడు వస్తాను." "మఱో అప్పుడు వస్తే మఱోలాగే వుంటుంది. ఇదిగో పావ్. అదిగోహూవ్. అంతా నాచేతిలో వుంది."

అంశమంతుడు "ఉండవయ్యా! కాస్త ఆలోచించుకో నియ్యవయ్యా! నాకు మా అంకమ్మ ఎక్కడ వేస్తే అక్కడ

వెయ్యాలని వుంది" అవతల వాడు "అందుకే ముందుగా అడిగాను అంకమ్మ అంటే ఎవరు?" అని—అంశమంతుడు "ఎవరని చెప్పను నీతో? నే నెఱిగున్న మనిషి నీవెఱుగని మనిషి. ఈ దాకా నాతోవున్న త్రిప్పలాడి, ఇప్పుడే తప్పించుకు పోయిన వొప్పుల గొప్ప. నీకేమని సెప్పేది?" లాతివాడు "ఆవిడా? ఆ మనిషా? ఆ అంకమ్మా: రా! నాతో రా! నే చూపిస్తా! రా! రావోయి వెఱ్ఱిమొగమా? నేచూపిస్తానంటే ఆలా హడిలిపోతావేం? ఇదేంటి సందు. ఆ మనిషి యీలాగే వెళ్ళింది. నే చూచాను. నీవు చూశ్శేదు గాని, అంటూ వో సంచంట అంశ మంతుణ్ణి—వీడు ఈ దుర్మార్గుడు, వాణ్ణి ఆ సన్మార్గుణ్ణి "రాను బాబోయి" అంటూవున్నా లాక్కుపోయాడు.

పట్టపగలు పండ్రెండు గంటలవేళ హైరోడ్డుమీద జరిగిన పని అది.

మళ్ళాకథలో కాలం చూడవలసింది ఆ రోజునే రాత్రి పండ్రెండు గంటలప్పుడు ఈ రోజుల్లో రాత్రి పండ్రెండు గంట లంటే కృతయుగంలో నాటి రేత్రి పండ్రెండు గంటల్లా, చీకటిగా నిదర నిశ్శబ్దంగా నిర్మానుష్యంగా వుండి అర్ధరేత్రి అపరేత్రి అనిపించుకునే గంటలు కావు. ఏమనుకున్నారో: పట్టపగల్లా విద్యుద్దీపాలు—దీపాలతో సహా గదులు-గదుల్లో స్త్రీల పురు షుల బ్రాకెట్ల పందెళ్ళ సందడి మెళుకువులు రాత్రి అన్నది సూర్యభగవానుడికిగాని మనిషికి ఈనాడులేదు. పోయింది. తుడిచిపెట్టుకు పోయింది.

ఈ మాటు వొకరివెనుక వొకరు కాకుండా అంకమ్మా అంశమంతుడు హైరోడ్డుమీద ఎదురెదురునడకను దసులయ్యారు.

అంకమ్మ "నీది యీ యేడే ప్రారంభం అనుకుంటా" అంశమంతుడు "నీది?" అంకమ్మ "నాది నెలా పదేనురోజుల్నుంచి పరిపాటి అయిపోయిందని మధ్యాహ్నం చెప్పానుగా! గాపకం లేదూ?" అంశమంతుడు "ఈ నెలా పదేను రోజుల్నుంచి ఇదే వేళా?" అంకమ్మ "ఈ వేళగాని అంకె నిలేబడదు. అంకె అనే అనదు." అంశమంతుడు "అన్నీ ఎన్ని అంకెలు? అంకమ్మ "అంకెలు తొమ్మిదే" అంశమంతుడు "మరిఖనేం. నాకు తొమ్మిదంకెలూ వచ్చు—ఒకటి రెండు మూడు నాలు గైదారు ఏడు ఎనిమిది తొమ్మిది—" అంకమ్మ "వాటితో సున్నకూడా మధ్యనో చివర్నో వుంటే—అప్పుడు అంకెకు విలువ" అంశమంతుడు "మగాడితో ఆడదున్నప్పుడు మగాడికి విలువ వచ్చినట్టు" అంకమ్మ "అదెట్లా?" అంశమంతుడు "ఆడదాని దగ్గతేగా బంగారం వుండేవి" అన్నాడు, అంకమ్మ మెళ్లోని బంగారపు బిళ్ళ చూస్తూ.

అంకమ్మ కంతలో మార్వాడీ, మార్వాడీ హాల్లోని పెద్దద్దం—మెత్తలు అన్నీ గాపకం వచ్చినాయి. వెంటనే మెళ్లో మొహరీ తడుముకుంటూ "దీని తేటు అంతా యీ పొద్దు తాకట్టిడిపించుకు తెచ్చుకొనేటప్పుడు చూడాలి!" అంటూ కళ్ళెగరేసింది. అంశమంతుడు "పెద్దద్దం లోనా? అన్నాడు.

"నీవెక్కడ చూచావురా?" అని అడిగింది అంకమ్మ. అంశమంతుడు "పెద్దద్దమా? షర్బత్ లింగంహాల్లో నామీసాల్ వదెట్టుకుంటూ" అన్నాడు.

.... .... .... .... ....